సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023

రంజాన్ వేళలు

అనకాపల్లి

ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
6-16	4-26

నర్సీపట్నం

6-20	4-25

ఉష్ణోగ్రత

చోడవరం 40.0

అనకాపల్లి 39.2

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి గురువారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 34.6 నుంచి 34.8 డిగ్రీలు, తేమ 70 నుంచి 72 శాతం, గాలి గంటకు 5 నుంచి 7 కిలోమీటర్ల వేగంతో వీస్తుందని పేర్కొన్నారు.

● రాజ్యాంగ నిర్మాతకు నివాళి

తోటకూర గింజలతో అంబేడ్కర్ చిత్రం



తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ తోటకూర గింజలతో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రాన్ని రూపొందించారు. శుక్రవారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సందర్భంగా రవికుమార్ 1,597 తోటకూర గింజలతో ఈ చిత్రాన్ని తయారు చేశారు. నుదిటి భాగంలో 238 సార్లు అంబేడ్కర్ అని సూక్ష్మలిపిలో రాశారు.

- మాకవరపాలెం

సైలెంట్ కాదు... వయలెంట్!



- భూ వివాదంలో సీఐ!
- ఫోన్‌లో నేరుగా బెదిరింపులు
- జీపునకు కట్టి ఈడ్చుకొస్తానంటూ హెచ్చరికలు
- వైరలవుతున్న ఫోన్ రికార్డింగ్
- అన్ని స్టేషన్లపై ప్రత్యేక దృష్టి
- స్టేషన్ల నుంచి నేరుగా వసూళ్లు చేస్తున్నట్టు ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా కేంద్రంలో పోలీసు పాలనా వ్యవస్థకు కళ్లు, చెవులుగా ఉండాల్సిన విభాగంలో ఉన్న ఓ సీఐ భూ వివాదాల్లో తలదూర్చడం వివాదంగా మారుతోంది. ప్రధానంగా పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లో ఉన్న భూ వివాదాల్లో సదరు సీఐ జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా సబ్బవరానికి చెందిన ఓ ప్రైవేటు భూమి విషయంలో నేరుగా ఫోన్ చేసి బెదిరించిన వ్యవహారం వైరల్ అవుతోంది. జీపునకు కట్టి ఈడ్చుకొస్తానంటూ హెచ్చరించిన ఫోన్ రికార్డింగ్ ఆడియో ఒకటి సంచలనంగా మారింది. అంతేకాకుండా సదరు సీఐ వ్యవహారంపైనా బోలెడు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లకు తెగబడుతున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా సబ్బవరం, పెందుర్తి ప్రాంతాల్లో పేకాట డెన్‌ల నుంచి నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. ఒకవేళ ఏదైనా స్టేషన్ నుంచి తాను చెప్పినట్టు వినకపోతే వ్యతిరేకంగా నివేదిక సమర్పిస్తానంటూ బెదిరిస్తున్నట్టు సమాచారం. మొత్తంగా సైలెంట్‌గా పనిచేసుకుపోవాల్సిన విభాగంలోని సీఐ కాస్తా.... బహిరంగంగా వయలెంట్‌గా వ్యవహరిస్తుండటం విమర్శలపాలవుతోంది.

దీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బందితో...

జిల్లా పోలీస్ శాఖలో సైలెంట్‌గా ఉండే ఈ విభాగంలో లాంగ్ స్టాండింగ్ సిబ్బంది (హెచ్‌సీ, పీసీలు) ఉన్నారు. వీరితో ప్రతి నెలా మామూళ్లు వసూళ్లు చేయిస్తుండని ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. గ్యాంబ్లింగ్ (పేకాట) ఆర్గనైజర్ల నుంచి నెలవారీ మామూళ్లు ఆయనకు రావాల్సిందే. గతంలో తాను పనిచేసిన స్టేషన్లపై ప్రధానంగా దృష్టి సారించి... పాత పరిచయాలతో మామూళ్లకు తెగబడుతున్నట్టు తెలుస్తోంది. అనకాపల్లి రూరల్, చోడవరం రూరల్, సబ్బవరం ప్రాంతాల నుంచి ఎక్కువగా వసూళ్లు చేస్తాడన్న ఆరోపణలున్నాయి. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుని ఆ స్టేషన్లలో ఎటువంటి కేసులు నమోదవుతున్నాయో తెలుసుకోవడంతోపాటు... వాటిపై ఏ విధంగా కేసులు నమోదు చేయాలో ఇక్కడి నుంచి నిర్దేశిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకవేళ తాను చెప్పినట్టుగా వినకపోతే ఉన్నతాధికారుల వద్ద తప్పుడు నివేదికలు సమర్పించి... వీఆర్‌కు పంపుతారనే ఆందోళన స్టేషన్లలోని సిబ్బందిలో వ్యక్తమవుతోంది. ఇటీవల ఇద్దరు ముగ్గురు ఎస్సైలను అలాగే ఏఆర్‌కి అటాచ్ చేయించడంలో ఈయన పాత్ర ఉందని అనకాపల్లి పోలీసుల్లో బహిరంగంగా చర్చ సాగుతోంది.

భూ వివాదాల్లో...

వాస్తవానికి సివిల్ కేసుల్లో పోలీసులు తలదూర్చవద్దని స్పష్టంగా ఆదేశాలున్నాయి. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తోంది. అయితే, ఇందుకు భిన్నంగా భూ వివాదంలో తలదూర్చడంతోపాటు తన మాట వినకపోతే నేరుగా హెచ్చరికలు చేయడం గమనార్హం. గతంలో తాను పనిచేసిన సమయంలో ఉన్న పరిచయాలతో ఆ ప్రాంతాల్లోని భూములపై అవగాహన ఉండటంతో ఆయా పార్టీలను పిలిపించుకుని మరీ సెటిల్‌మెంట్లకు దిగుతున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లోని భూవివాదాలపై దృష్టి సారించినట్టు సమాచారం. ఆ భూవివాదాల్లో ఆయా పార్టీల నుంచి భారీగా లబ్ధి పొందుతున్నట్టు కూడా తెలుస్తోంది. సదరు సీఐ వ్యవహారంపై లోతుగా విచారిస్తే మరిన్ని అక్రమ వ్యవహారాలు బయటకు వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూస్‌రీల్

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

అనకాపల్లి టౌన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులకు ప్రభుత్వం ప్రత్యేక సేవా పతకాలను ప్రకటించింది. జిల్లాలో ఏఆర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.కేశవరావు, టి.అప్పారావు, జి.ధనరాజు సేవా పతకాలు దక్కించుకున్నారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నూకాంబిక సన్నిధిలో ఎస్పీ మురళీకృష్ణ



ఎస్పీకి అమ్మవారి చిత్రపటం బహూకరణ

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారిని జిల్లా కొత్త ఎస్పీ కె.వి.మురళీకృష్ణ గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారికి పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందించారు. ఎస్పీ మురళీకృష్ణకు దాడి జయవీర్ శేషవస్త్రాన్ని, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అదనపు ఎస్పీ బి.వి జయభాస్కర్, సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను, ఎస్ఐ వి.సత్యనారాయణ ఎస్పీ వెంట ఉన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఆర్‌జేడీ, డీఈవో

కశింకోట: మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను గురువారం విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) రమాజ్యోతి, జిల్లా విద్యా శాఖాధికారి (డీఈవో) వెంకటలక్ష్మమ్మ సందర్శించారు. తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆర్‌జేడీ సందర్శించారు. అక్కడ పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలను డీఈవో సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

విశాఖ లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనలతో మే 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.గోపి తెలిపారు. జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటారు ప్రమాదాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ చట్టం, రికవరీ, ల్యాండ్ ఎక్విజిషన్, రెవెన్యూ, కార్మిక, కుటుంబ తగాదాలు(విడాకుల కేసులు మినహా) పారిశ్రామిక వివాదాలతో పాటు రాజీపడే క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీ చేసుకోదలచినవారు తమ న్యాయవాది ద్వారా సంసిద్ధతను ముందుగా తెలియజేయాలన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుక

అనకాపల్లి టౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షురాలు సుజాత గురువారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రైవేటు ఆపరేటర్లతో ఆర్టీసీ 'ఢీ'ఎం

- కాంప్లెక్స్ సమీపం నుంచి ప్రైవేట్ సర్వీసులు నడపడంపై డీఎం ఆగ్రహం
- బస్సులు కదలకుండా బైఠాయింపు

నర్సీపట్నం: ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీప ప్రాంతం నుంచి తిప్పుతున్న ప్రైవేటు బస్సులను ప్రజారవాణా శాఖ (ఆర్టీసీ) డిపో మేనేజర్ ధీరజ్ గురువారం సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. డీఎం, ప్రైవేటు బస్సుల నిర్వాహకుల మధ్య ఈ సందర్భంగా వాగ్వాదం చోటు చేసుకుంది. నిబంధనలను అతిక్రమించి ప్రైవేటు ఆపరేటర్లు ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నందునే అడ్డుకోవాల్సి వచ్చిందని డీఎం పేర్కొన్నారు. ప్రైవేటు బస్సుల నిర్వాహకులు మొండిగా వ్యవహరించడంతో కదలనివ్వకుండా బస్సుల ముందు డీఎం కుర్చీ వేసుకుని కూర్చున్నారు. ఆర్టీసీ సిబ్బంది, ప్రైవేటు బస్సుల సిబ్బందికి మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ప్రైవేటు బస్సులను తిరగనివ్వకుండా అధికారులు అడ్డుకున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ప్రైవేటు బస్సులు తిప్పితే ఊరుకునేదిలేదని డీఎం హెచ్చరించారు. దేశంలోనే అతి తక్కువ ప్రమాదాలతో ఆర్టీసీ పనిచేస్తోందన్నారు. అనుభవజ్ఞులైన సిబ్బందితో సురక్షితమైన ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. భద్రత లేని ప్రైవేటు బస్సులను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలని డీఎం ప్రజలకు సూచించారు.



ప్రైవేటు బస్సులను కదలనివ్వకుండా కుర్చీ వేసుకొని బైఠాయించిన ఆర్టీసీ డీఎం ధీరజ్



ప్రైవేటు బస్సులను అడ్డుకున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

జేసీగా జాహ్నవి బాధ్యతల స్వీకారం

సాక్షి, అనకాపల్లి: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎం.జాహ్నవి గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ ఆమెకు జిల్లా ప్రొఫైల్‌ను అందజేశారు. ఎంతమంది తహసీల్దార్లు ఉన్నారు.. జిల్లాలో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారు.. ఎన్ని ఖాళీలు ఉన్నాయి.. తదితర వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులతో జేసీ మాట్లాడారు. ముందుగా ఆమె కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారుల సంఘం తరపున సీపీవో జి.రామారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి కళ్యాణి, ఇతర సిబ్బంది, ఏపీ ఈపీడీసీఎల్ ఇంజినీర్లు కొత్త జేసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆర్డీవో చిన్నికృష్ణ, ఏవో శ్రీనివాసరావు, ఎస్‌డీసీలు అనిత, జ్ఞానవేణి, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, డీపీఓ శిరీషరాణి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటరమణ, డీపీఆర్ఓ సాయిబాబా తదితరులున్నారు.



జేసీ జాహ్నవికి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అయ్యన్న ప్రసంగాన్ని అడ్డుకున్న సర్పంచ్

నర్సీపట్నం: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రసంగాన్ని సర్పంచ్ శెట్టి అచ్చిరాజు అడ్డుకున్నారు. నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామంలో గురువారం రాత్రి టీడీపీ నాయకులు ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. రామాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అయ్యన్నపాత్రుడు ప్రసంగిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అక్కడకు చేరుకున్న గ్రామ సర్పంచ్ శెట్టి అచ్చిరాజు స్టేజ్‌పైకి వెళ్లి అయ్యన్నపాత్రుడు ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు తనకు మైక్ ఇవ్వాలని పట్టుబట్టారు. ఇందుకు అయ్యన్నపాత్రుడు అభ్యంతరం చెప్పారు. టీడీపీ కార్యకర్తలు కలుగజేసుకుని సర్పంచ్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, సర్పంచ్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.



అయ్యన్నపాత్రుడిని నిలదీస్తున్న సర్పంచ్ అచ్చిరాజు

17 నుంచి దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ పరీక్షలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం పరిధిలో ఎంబీఏ, ఎంబీఏ(హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్), ఎంసీఏ, పీజీ డిప్లమా ఇన్ కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అండ్ అప్లికేషన్(పీజీడీసీపీఏ) కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయని కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 20 కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. పీజీడీసీపీఏ-1లో బ్యాక్‌లాగ్ ఉన్న విద్యార్థులు ఏయూ దూరవిద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ www.andhra universitysde.com నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలు, పానీయాలు అందించే స్వచ్ఛంద సంస్థల సహకారం చాలా గొప్పదని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నారు. ఈ నెల 23న జరిగే చందనోత్సవంలో భక్తులకు సేవలందించే సంస్థల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎవరెవరు ఏయే ప్రదేశాల్లో భక్తులకు ఉచిత ప్రసాదం, పానీయాలు అందిస్తారో తెలుసుకున్నారు.

ఏటా సుమారు 70 సంస్థలు చందనోత్సవంలో భక్తులకు సేవలందిస్తున్నాయన్నారు. చిన్నారులకు పాలు, బిస్కట్లు, భక్తులకు మంచినీరు, మజ్జిగ, ఫలాలు, పులిహోర అందజేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అయితే ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసులు తమ వాహనాలను అడ్డుకుంటున్నారని, వెహికల్‌పాస్ చూపించాలని ఆదేశిస్తున్నారని ఈవో దృష్టికి పలువురు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఈవో స్పందిస్తూ పోలీస్ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా ముగిసిన కౌన్సెలింగ్

- డీఎస్సీ-98 అభ్యర్థులకు పోస్టింగ్‌లు
- 324 మందికి నియామక పత్రాలు అందజేత
- ఏజెన్సీలో తీరిన ఉపాధ్యాయుల కొరత

విశాఖ విద్య: డీఎస్సీ-98 అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు విశాఖ డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న డీఈవో ఎల్.చంద్రకళ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. జాబితాలో ఉన్న 201 నుంచి 355 సీరియల్ నంబర్ల వరకు గల అభ్యర్థులను మెరిట్ మేరకు ఒక్కొక్కరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీల జాబితాను కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులందరికీ కనిపించేలా ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అభ్యర్థులు తమకు నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకునేలా తగిన సమయం కేటాయించారు. రెండో రోజు పూర్తిగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే ఖాళీలను చూపించారు. కౌన్సెలింగ్ అనంతరం డీఈవో ఎల్.చంద్రకళ వారికి నియామక పత్రాలను అందజేశారు. దీంతో ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో గల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరింది. ప్రతీ పాఠశాలలో ఇద్దరేసి ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చినట్లైంది. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి, సూపరింటెండెంట్ కె.జగన్నాథరావు, పీఆర్వో వర్మ, అల్లూరి సీతారామరాజు డీఈవో కార్యాలయం నుంచి సూపరింటెండెంట్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు. 25 ఏళ్ల తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువు దక్కడంతో డీఎస్సీ-98 అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరిసింది.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విశాఖ డీఈవో చంద్రకళ

324 మందికి పోస్టింగ్

రెండు రోజులపాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 324 మందికి ఉపాధ్యాయులుగా నియామక పత్రాలను అందజేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిబంధనల మేరకు డీఎస్సీ-98లో 355 మందిని ఎంపిక చేసి కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. కౌన్సెలింగ్ నాటికి వీరిలో 60 ఏళ్లు నిండిన వారు ఇద్దరు ఉండటంతో వీరి పేర్లను జాబితా నుంచి తప్పించారు. మరో ఇద్దరు కౌన్సెలింగ్‌కు హాజరైనప్పటికీ, పోస్టింగ్‌లు తీసుకునేందుకు నిరాసక్తత వ్యక్తం చేశారు. 27 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్‌కు గైర్హాజరైనట్లు డీఈవో కార్యాలయ అధికారులు వెల్లడించారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో 93 మందికి మైదాన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు దక్కగా, 231 మందికి ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు.

సొంత మండలంలో పోస్టింగ్

మాడుగుల: పాతికేళ్ల నిరీక్షణ తర్వాత వీరవిల్లి గ్రామానికి చెందిన దొండా చిన వెంకన్న దొరకు ఉపాధ్యాయ పోస్టు వరించడంతో ఆనందంతో పొంగిపోతున్నారు. 1998 డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించడంతో ఆయనకు న్యాయం జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల తన ఆశయం నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఐదారేళ్లు పోరాడినా ఫలితం లేకపోవడంతో ఇక ఉద్యోగం రాదని చిన వెంకన్న దొర వ్యాపారం పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇప్పుడు సొంత మండలంలో ఉద్యోగం రావడంతో గురువారం మండలంలోని ఎం.కృష్ణాపురం పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు వచ్చిన సమయంలో తామంతా విజయనగరంలో కలిశామన్నారు. ఆరోజే మీ కల నెరవేర్చుతానని హామీ ఇచ్చారని, అనాటి మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు.



చిన వెంకన్న దొర

ఎల్‌హెచ్‌బీ రేక్‌తో గాంధీధామ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు వాల్తేర్ డివిజన్ చురుగ్గా పనిచేస్తోంది. అత్యాధునిక జర్మన్ టెక్నాలజీతో తయారు చేసిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను పాత కోచ్‌ల స్థానంలో అంచెలంచెలుగా పలు రైళ్లకు జతచేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతీ గురువారం విశాఖపట్నం నుంచి బయల్దేరే విశాఖపట్నం - గాంధీధామ్ - విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేశారు. ఈ ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన రైలును గురువారం సాయంత్రం వాల్తేర్ డివిజన్ డివిజినల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) అనూప్‌కుమార్ సత్పతి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అనూప్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో అత్యధిక రైళ్లను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుపుతున్న ఘనత వాల్తేర్ డివిజన్‌కే దక్కుతుందన్నారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 21 రేక్‌లను, 31 రైళ్లను పూర్తి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుపుతున్నట్లు తెలిపారు. మరిన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను త్వరలో జత చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అందిస్తున్న సహాయ సహకారాలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి నాయకత్వంలో డివిజన్ దూసుకుపోతోందని తెలిపారు. ఆయన కృషితో ఇటీవల రూ.450 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడు ప్రధాన ప్రాజెక్టులకు బుధవారమే ఆమోదం లభించిందన్నారు.



గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

పట్టుదలతో... పది పరీక్షలకు హాజరు!

• గత నెల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న విద్యార్థి


పరీక్ష కేంద్రానికి విద్యార్థి తీసుకొస్తున్న బంధువులు

కె.కోటపాడు: చదువుపై మమకారంతో ఎ.కోడూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థి పైల ఎర్నికుమార్ నడవలేని స్థితిలోనూ పది పరీక్షలకు హాజరవుతున్నాడు. మండలంలోని జోగన్నపాలెంలో తన ఇంటి వద్ద గత నెల 15న జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. అతడి కుడి కాలికి తీవ్ర గాయం కావడంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. పది పబ్లిక్ పరీక్షలు ఈ నెల 3 నుంచి ప్రారంభమైన నేపథ్యంలో తన బంధువుల సహాయంతో ఆటోలో కె.కోటపాడు కేంద్రానికి రోజూ చేరుకుంటున్నాడు. అక్కడ అతడు పరీక్ష రాసేందుకు వీలుగా కేంద్రం చీఫ్ బి.సూర్యనారాయణమూర్తి సౌకర్యాలు కల్పిస్తున్నారు. నడవ లేని స్థితిలో విద్యార్థి పట్టుదలతో పరీక్షలకు వస్తుండటాన్ని చూసి పలువురు అభినందిస్తున్నారు.

ప్రాధాన్యత క్రమంలో తారురోడ్ల నిర్మాణం

• పిండ్రంగి, కొత్తభూమి గ్రామాల మధ్య పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


నిర్మాణం పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు వివరిస్తున్న అధికారులు

కె.కోటపాడు: నియోజకవర్గంలో అన్ని గ్రామాలను కలుపుతూ మట్టిరోడ్లను ప్రాధాన్యత క్రమంలో తారురోడ్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని డి.అగ్రహారం-పింద్రంగి, కొత్తభూమి-పింద్రంగి గ్రామాల మధ్య తారురోడ్ల నిర్మాణ పనులను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. బైక్‌పై ప్రయాణించి అధికారులకు పలు సూచనలు చేశారు. అవసరమైన చోట కల్వర్టు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల శివారు గ్రామం శృంగవరం గ్రామస్తులకు తారురోడ్డు సౌకర్యంతో ఇకపై ప్రయాణ కష్టాలు తీరనున్నట్లు తెలిపారు. డి.అగ్రహారం నుంచి పింద్రంగి వరకూ కిలోమీటరు మేర రోడ్డుకు రూ.63 లక్షలు, పింద్రంగి నుంచి ముషిరాం, కొత్తభూమి రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, విజయనగరం జిల్లా ముషిరాం నుంచి అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం కొత్తభూమి వరకు రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేశామన్నారు. తమ గ్రామాల కష్టాలను తీర్చేందుకు చర్యలు తీసుకున్న డిప్యూటీ సీఎంకు పింద్రంగి గ్రామ సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక సేవలో కాకినాడ ఎండోమెంట్ అధికారి


అమ్మవారిని దర్శించుకుంటున్న సురేష్‌బాబు

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని కాకినాడ దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం.వి.సురేష్‌బాబు, అమలాపురం సహాయ కమిషనర్ కె.ప్రసాద్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

16న బీసీ గురుకులాల ప్రవేశ పరీక్ష


జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: జిల్లాలో బీసీ గురుకులాలకు సంబంధించి ఈ నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు నర్సీపట్నం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎస్.వెంకటరెడ్డి గురువారం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికిగాను బీసీ సంక్షేమ గురుకుల సంస్థ ఆధ్వర్యంలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలోని నర్సీపట్నం, అనకాపల్లి, తానాం, చోడవరం కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు https://www.mjpapbcwr.in వెబ్‌సైటులో హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


లారీ కింద చిక్కుకున్న మండేలను బయటకు తీస్తున్న 108 సిబ్బంది,స్థానికులు

బుచ్చెయ్యపేట: మండలంలోని విజయరామరాజుపేట తాచేరు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చీడికాడ మండలం దిబ్బపాలెంకు చెందిన పూచల మండేల అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం వడ్డాది నుంచి చోడవరానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో మండేల ఎడమ కాలుపై నుంచి లారీ వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కుమారస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సాయంత్రానికే మాట మార్చారు

• స్టీల్‌ప్లాంట్ అంశంపై కేంద్ర సహాయ మంత్రి విరుద్ధ ప్రకటనలు
• మండిపడుతున్న ఉక్కు కార్మిక సంఘాల నేతలు



ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ మాట మార్చారని కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. గురువారం ఉదయం పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రైవేటీకరణ కంటే ముందు స్టీల్‌ప్లాంట్ బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం నోవాటెల్‌లో తమతో ప్రైవేటీకరణ అంశం తన చేతుల్లో లేదని, కేంద్ర పెద్దలతో మాట్లాడి తీసుకోవాల్సిన నిర్ణయమని స్పష్టం చేశారని పేర్కొన్నారు. మంత్రి చేసిన రెండు విభిన్న ప్రకటనలపై కార్మిక సంఘాలు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసమే స్టీల్‌ప్లాంట్ అంశంపై స్వరం మార్చారని ఆరోపించారు.


పోరాటాలను చల్లార్చే ఎత్తుగడ



తెలుగు ప్రజలు ఆందోళనకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం చేసిన ఎత్తుగడ ఇది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) ఆధీనంలోకి వెళ్లింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ప్రతీ విధాన నిర్ణయం దీపం నుంచి వస్తోంది. మొదట దీపం నుంచి బయటకు తీసుకు వస్తేనే స్టీల్‌ప్లాంట్‌కు స్వయంప్రతిపత్తి లభిస్తుంది. కేబినెట్ నుంచి ఆమోదముద్ర వచ్చే వరకు ఈ నిర్ణయాన్ని నమ్మడానికి లేదు.

– డి.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి, గుర్తింపు సంఘం


కేంద్ర ప్రభుత్వ వ్యూహాత్మక ప్రకటన



మంత్రి ఫగ్గన్ చేసిన ప్రకటన కేంద్ర ప్రభుత్వానికి చెందిన వ్యూహాత్మక నిర్ణయం. తన పర్యటనలో ఆందోళనలు జరగకుండా చూసేందుకు ఆ విధంగా మాట్లాడి ఉండొచ్చు. కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తన పరిధిలో లేదని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పడం బట్టి ఆయన ప్రకటన అర్థమవుతోంది.

– మంత్రి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఐఎన్‌టీయూసీ

నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదు



ప్రైవేటీకరణ రద్దు అంశంపై కేంద్ర మంత్రి ఎటువంటి నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదు. ప్లాంట్‌కు కావాల్సిన రా మెటీరియల్ ఇవ్వాల్సిన మంత్రి ఆ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు. ప్లాంట్‌కు కావాల్సిన రా మెటీరియల్ ఇస్తే కచ్చితంగా లాభాలు సాధించి చూపిస్తాం. ప్రైవేటీకరణ రద్దుపై వెంటనే నిర్ణయం తీసుకోకపోతే మేరింత రెట్టించిన ఉత్సాహంతో పోరాడుతాం.

– జె.అయోధ్యరామ్, స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

అనకాపల్లి టౌన్: మహిళపై దౌర్జన్యం చేసిన ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ సీహెచ్.నరసింగరావు చెప్పారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. కొప్పాక గ్రామానికి చెందిన మండా మరియ్యమ్మ కొనుగోలు చేసిన గృహంలోకి అదే గ్రామానికి చెందిన నీరుకొండ సాయిరాంకృష్ణ, నీరుకొండ అప్పారావు, నీరుకొండ సత్యవతి, నీరుకొండ మాధవి, నీరుకొండ వాణి, అడుసమల్లి విజయలక్ష్మి ప్రవేశించి దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ చెప్పారు.

బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ప్రైడ్ అవార్డు ప్రదానం


డీఎస్పీ శ్రీనివాసరావు నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ టైటస్

దేవరాపల్లి: మండలంలోని కాశీపురానికి చెందిన ప్రధాన మంత్రి 15 పాయింట్స్ ప్రోగ్రాం జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ గొర్లె టైటస్ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకున్నారు. అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఢిల్లీకి చెందిన ఆసియన్ ఆర్టిస్ట్ యూనియన్ ఆర్గనైజేషన్ వారు డాక్టర్ భీమ్ రావ్ అంబేడ్కర్ నేషనల్ ప్రైడ్ అవార్డు-2023 ప్రదానం చేశారు. ఈ అవార్డును పరవాడ డీఎస్పీ పి. శ్రీనివాసరావు నుంచి గురువారం అందుకున్నారు. నిస్సి మినిస్ట్రీస్ డైరెక్టర్ హోదాలో గిరిజన గ్రామాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు టైటస్ తెలిపారు. ఆసియన్ ఆర్టిస్ట్ యూనియన్ ఢిల్లీ ఆర్గనైజేషన్ చైర్మన్ రాజేష్ శ్రీవాస్తవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఐదు మట్టి ట్రాక్టర్లు సీజ్


పట్టుబడిన మట్టి ట్రాక్టర్లు

మాకవరపాలెం: అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని రామన్నపాలెం వద్ద చెరువులోంచి బుధవారం అర్ధరాత్రి మట్టిని తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

విద్యా కానుకలు సక్రమంగా అందాలి


ఉపాధ్యాయులతో నాంచారయ్య

గొలుగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు సక్రమంగా అందాలని సమగ్ర శిక్ష రాష్ట్ర సహాయ సంచాలకుడు జి. నాంచారయ్య తెలిపారు. ఆయన గురువారం జోగుంపేట పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్‌లు పరిశీలించారు. విద్యా రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం పథకాలతోపాటు అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. వాటిని విద్యార్థులకు చేరువ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండలానికి రానున్న స్టాక్‌కు పోలీసుల సహకారంతో భద్రత తీసుకోవాలని తెలిపారు. ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిట్ల స్టాక్ పాయింట్ పరిశీలన

కోటవురట్ల: జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతోందని సమగ్ర శిక్ష సహాయ సంచాలకుడు నాంచారయ్య తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మార్సీలో జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్సీల్లో స్టాక్ పాయింట్, విద్యార్థుల సంఖ్య తదితర వివరాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎంఈవో పెన్నాడ అప్పారావు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

చెరువుల సరిహద్దుల్లో సర్వే రాళ్ల ఏర్పాటు

• జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సందీప్


చింతపాకలో చెరువులో సర్వే రాళ్లు దించుతున్న అధికార్లు

బుచ్చెయ్యపేట: జగనన్న భూ రక్ష శాశ్వత భూ హక్కులో సర్వే చేసిన అన్ని గ్రామాల్లోని చెరువు గర్భాలు, ప్రభుత్వ స్థలాల సరిహద్దుల్లో సర్వే రాళ్ల ఏర్పాటు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సందీప్ ఆదేశించారు. గురువారం ఆయన బుచ్చెయ్యపేటలో తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో సువర్ణరాజు, ఏపీవో మురళి, ఉపాధి హామీ పథకం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వలస పోకుండా ఉపాధి పనులు కల్పిస్తున్న చెరువులను కాపాడుకోవాలన్నారు. ఇప్పటికే సర్వే పూర్తయిన చిట్టియ్యపాలెం, చింతపాక, కరక, పెదపూడి, బట్లోవ తదితర గ్రామాల్లో తక్షణమే సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో 21 వేల సర్వే రాళ్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటికి నాలుగు వేలు మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. మిగిలినవి వెంటనే వేయాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని గ్రామాల్లోనూ ఉదయం 6 గంటలకే ఉపాధి పనులకు వేతనదారులు వచ్చేలా చర్యలు చేట్టాలన్నారు. అనంతరం ట్రాక్టర్లలో సర్వే రాళ్లను తీసుకొచ్చి చింతపాకలో దింపించారు. ఆయన వెంట ఏపీడీ ఎం.శ్రీనివాస్, ఈసీలు కొండాజీ, లక్ష్మీరావు, సతీష్, స్వామి, ఆనంద్, సర్వేయర్ సింహాచలం ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకుడు


ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకుడు రమణబాబు

నక్కపల్లి: పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సమక్షంలో నక్కపల్లికి చెందిన జనసేన నాయకుడు అల్లాడ రమణబాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అతడికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. తనతోపాటు మరి కొంతమంది రానున్న రెండు రోజుల్లో జనసేన పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరనున్నట్లు రమణబాబు తెలిపాడు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై తామంతా చేరాలని నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు జనపరెడ్డి శేషారత్నం, పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి, సూరాకాసుల గోవిందు, గొర్ల బాబూరావు, ఎరిపల్లి నాగేశు, కొర్లయ్య, కరణం ఈశ్వరరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు ఎనలేనివి


మాట్లాడుతున్న విశ్రాంత డీన్ విశ్వనాథ్

చోడవరం రూరల్: అంటరానితనాన్ని రూపుమాపి, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి ఎనలేనిదని ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత డీన్ కందర్ప విశ్వనాథ్ తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక ప్రేమ సమాజంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ జీవితం - సందేశం అనే అంశంపై డీన్ విశ్వనాథ్ ముఖ్య వక్తగా విపులంగా వివరించారు. ముఖ్యఅతిథిగా అడ్వకేట్ ఎడ్ల వెంకటరావు అంబేడ్కర్ సంస్కరణలను వివరించారు. కార్యక్రమంలో ఆర్క్ ప్రసాద్, ప్రేమ సమాజం కార్యదర్శి ప్రసాదరాజు, ఉపాధ్యాయుడు బి.మణికంఠ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సైంధవ్


సినిమా షూటింగ్ లొకేషన్‌లో విక్టరీ వెంకటేష్

కొమ్మాది: నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా సినిమా సైంధవ్ షూటింగ్ గురువారం స్టీల్‌ప్లాంట్‌లో మొదలైంది. విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను మరో 5 రోజులు పాటు అక్కడ చిత్రీకరించనున్నారు. వెంకట్ బోయినపల్లి నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు సంతోష్ నారాయణ్ సంగీతం అందిస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి


దేవరాపల్లి: లెక్కల రమణ మృతదేహం


చోడవరం: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


విద్యుత్ షాక్‌తో మరణించిన కన్నబాబు మృతదేహం


చికిత్స పొందుతున్న రహమాన్

దేవరాపల్లి: అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. దేవరాపల్లికి చెందిన లెక్కల రమణ (54) డాబాపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి బుధవారం రాత్రి మృతి చెందినట్టు అడిషనల్ ఎస్‌ఐ బి.మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత మేడపై నిద్రించేందుకు వెళ్లిన రమణ ప్రమాదవశాత్తు కాలు జారి సిమెంట్ రోడ్డు మీద పడిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న అతనిని వెంటనే స్థానికులు దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మృతుడి భార్య సత్యవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్‌ఐ మల్లికార్జునరావు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

చోడవరం రూరల్: పట్టణంలోని లక్ష్మీపురం రోడ్డులో చోడవరం జిమ్‌కు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతిచెందాడు. గమనించిన స్థానికులు చోడవరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ బి.అప్పలనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి ఆచూకీ కోసం ఆరా తీశారు. మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో అతిగా తాగడం వల్ల గాని, ఎండవేడి వల్లగాని మరణించి ఉండవచ్చని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా ఈ వ్యక్తి కొంత కాలంగా స్థానికంగా ఉంటూ తాపీమేస్త్రీగా పనులకు వెళ్లేవాడని, అతిగా మద్యం తాగే అలవాటు ఉందని, అతనిది శ్రీకాకుళం జిల్లా అని కొందరు కూలీల ద్వారా తెలిసిందని చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. అంతకుమించి అతని వివరాలు తెలియరాలేదన్నారు. శవపంచనామా జరిపి, అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు.మృతుడి ఆచూకీ తెలిసిన వారు చోడవరం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాల్సిందిగా ఎస్‌ఐ అప్పలనాయుడు కోరారు.

విద్యుత్ షాక్‌తో...

మాకవరపాలెం: విద్యుత్‌షాక్‌తో ఓ తాపీమేస్త్రి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మాకవరపాలెం మండలం ముషిడిపాలెంలో జరిగిన ఈ ఘటనతో బుచ్చన్నపాలెంలో విషాదం అలముకుంది. బుచ్చన్నపాలెం గ్రామానికి చెందిన రుత్తల కన్నబాబు(40) ఎప్పటిలాగే గురువారం ఉదయం పక్క గ్రామమైన ముషిడిపాలెంలో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. చామంతిపురం గ్రామానికి చెందిన మరో మేస్త్రి షేక్ రహమాన్(44)తో కలిసి ఇనుప ఊచలను ఇంటి పైకి తీసుకెళుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తూ తగిలి షాక్‌కుగురయ్యారు. దీంతో కన్నబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. రహమాన్‌కు తీవ్రగాయాలై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. రహమాన్‌ను 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కన్నబాబుకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కన్నబాబు మృతితో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

రాజవొమ్మంగి: కుటుంబ కలహాల కారణంగా ఓ గిరిజనుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాతంగి గ్రామానికి చెందిన పాతర కోటిబాబు(38) అనే గిరిజనుడు బుధవారం తన చేనుమకాంలో ఉన్న దూలానికి ఉరి వేసుకున్నాడు. అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

శారదా నదిలో జారి పడి..


అప్పారావు మృత దేహం

యలమంచిలి: ప్రమాదావశాత్తు శారదా నదిలో జారిపడి మండలంలోని జంపపాలెంకు చెందిన వెలగా అప్పారావు (47)అనే కూలీ గురువారం మృతి చెందాడు.యలమంచిలి రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం జంపపాలెం గ్రామానికి చెందిన వెలగా అప్పారావు మధ్యాహ్నం ఒంటిగంట సమీపంలో కాళ్లు చేతులు కడుగుకోవడానికి నదిలోకి దిగాడు.ప్రమాదావశాత్తు కాలు జారడంతో నదిలో మునిగిపోయాడు.స్థానికులు గుర్తించి ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బయటకుతీసే సరికి ప్రాణాలు కోల్పోయాడు. అతని భార్య,పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు.ఇక మాకు దిక్కెవరు అంటూ వారు రోదించిన తీరు స్థానికులను కన్నీరుపెట్టించింది. భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

16న పైడితల్లమ్మవారి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్: మండలంలో కేఎస్‌ఆర్‌పేట కొత్తూరులో వెలసిన పైడితల్లి అమ్మవారి నూతన ఆలయం మొదటి వార్షికోత్సవ వేడుకలు ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రంథాలయం సందర్శన



గ్రంథాలయ రికార్డులు తనిఖీ చేస్తున్న సంస్థ కార్యదర్శి వెంకటరావు

కశింకోట: స్థానిక గ్రంథాలయాన్ని గురువారం సాయంత్రం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. గ్రంథాలయ అధికారి వరలక్ష్మిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామన్నారు.

అందరి కృషితో క్షయ వ్యాధి నివారణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్, శారదాబాయి

అనకాపల్లిటౌన్: క్షయవ్యాధి నియంత్రణకు ప్రజలు సహకరించాలని జిల్లా డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో గురువారం ఆయన క్షయవ్యాధిపై పలు సూచనలతో కూడిన గోడపత్రికను ఆవిష్కరించారు. క్షయ సోకిన రోగి దగ్గినప్పుడు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పొగ తాగడం ద్వారా ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమిస్తుందని పేర్కొన్నారు. కొంత మంది అధ్ధ పొగ సేవిస్తుంటారని, అటువంటి వారు ఈ వ్యాధికి త్వరగా దగ్గరవుతారని చెప్పారు. వ్యాధిని నిర్మూలించేందుకు పొగ తాగడం మనుకుని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి, వైద్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
మీటర్	సత్యనారాయణ స్క్రీన్-1
డంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
శాకుంతలం (3డి)	పర్తిసాయి
భూతవైద్యుడు(ది పోప్స్ ఎగ్జార్సిస్ట్)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 2,814 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
స్పెషల్ రకం	4,030	4,180
మొదటి రకం	3,840	4,170
రెండో రకం	3,400	3,820
మూడో రకం	3,200	3,390

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 90 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ×ఎ౯పాజిటివ్-6 యూనిట్లు, ×ఎ౯నెగెటివ్-1 యూనిట్, ×బి౯పాజిటివ్-36 యూనిట్లు, ×ఒ౯పాజిటివ్ 46 యూనిట్లు, ×ఎబి౯పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 261 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

సమస్యలకు చెక్

- పట్టణ పరిధిలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు
- లో ఓల్టేజీ సమస్యలున్న ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు
- సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నంబర్

అనకాపల్లిటౌన్: వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరగడంతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంది. రాత్రీ పగలు తేడా లేకుండా నిత్యం వ్యాపారస్తులు, కంపెనీలు, గృహ వినియోగదారులు వేడి నుంచి ఉపశమనం కోసం ఏసీలు వినియోగిస్తున్నారు. పట్టణ పరిధిలో విద్యుత్ సమస్య లేకుండా ఉండేందుకు విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పట్టణ జనాభా సుమారు లక్షా 90 వేలకు చేరుకుంది. 418 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా నిత్యం వినియోగదారులకు విద్యుత్ అందజేస్తున్నారు.

లో ఓల్టేజీ సమస్యలు ఉన్న ప్రాంతాలు..

లో ఓల్టేజీ సమస్యలున్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో ఇనుపకొట్టు నాగేశ్వరరావు రహదారి, కరణాలవీధి, నర్సింగరావుపేటలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రహదారి, లక్ష్మీదేవిపేట, వాటర్ ట్యాంక్ రోడ్డు రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటర్లను 40 కేవీ నుంచి 100 కేవీకి అప్‌గ్రేడ్ చేశారు.

బెల్లంమార్కెట్ సబ్‌స్టేషన్ నుంచి..

11 కేవీ నుంచి గృహాలకు విద్యుత్ సరఫరా చేస్తారు.



ఇనుపకొట్టు రహదారిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కేటగిరీ వైజ్ సర్వీస్‌లు...

కేటగిరీ-1	-	17,550
కేటగిరీ-2	-	3,992
కేటగిరీ-3	-	63
కేటగిరి-4	-	273
కేటగిరీ-5	-	65
		21,943

నిత్యం 13 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పట్టణ పరిధిలో ఎక్కడైనా విద్యుత్ సమస్య ఉన్నట్లయితే వినియోగదారులు 1912 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తారు. రాత్రి సమయంలో పర్మినెంట్ ఉద్యోగులు ఇద్దరు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇద్దరు నిత్యం విధులు నిర్వహిస్తున్నారు.

సెఫ్టీగార్డుల ఏర్పాటు..

విద్యుత్ వైర్లు తెగిపోయినప్పుడు, ప్రమాదాలు జరిగి కొన్ని సమయాల్లో ప్రాణనష్టం జరుగుతుంది. అలా జరక్కుండా వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్‌శాఖ అధికారులు ప్రధాన రహదారుల్లో విద్యుత్ వైర్ల కింద భాగంలో సెఫ్టీగార్డులు ఏర్పాటు చేశారు.



నెయ్యిలవీధిలో ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ సమస్య వస్తే తక్షణం తెలియజేయాలి



వేసవి కాలంలో విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. విద్యుత్ సమస్య ఎక్కడైనా వచ్చినట్లయితే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసిన వెంటనే మా సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అత్యవసరమైన సమయంలో మాత్రమే ఏసీలు వినియోగించుకోవాలి.

– ఎం.శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఏఈ, అనకాపల్లి.

సదా స్మరణీయుడు అంబేడ్కర్



డైట్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అనకాపల్లిటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను సదా స్మరించుకోవాలని డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు అన్నారు. అంతకు ముందు కళాశాల ఆవరణలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగంలో అనేక గొప్ప అంశాలను పొందుపరిచారని అన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఫేర్‌వెల్ డే

విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. కళాశాల ఆవరణలో గురువారం ఫేర్‌వెల్ డే కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యలో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. ఈసీఈ విభాగాధిపతి పి.పూర్ణప్రియ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహారావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన వారపు సంత

కశింకోట: కశింకోటలోని వారపు సంత గురువారం భానుడి ప్రతాపానికి వెలవెలబోయింది. కశింకోట, అనకాపల్లి, మునగపాక, యలమంచిలి మండల గ్రామాల నుంచి వ్యాపారులు కూరగాయలు, ఆకు కూరలు, వంట సరకులు, తదితర వాటిని అమ్మకానికి తీసుకొచ్చారు. ఉదయం 11 గంటల వరకు ఎండ తీవ్రత తక్కువగా ఉండటంతో జనం కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఎండ తీవ్రతరం కావడంతో సంతకు వచ్చేందుకు వెనుకడుగు వేశారు. దీంతో దుకాణాలు వెలవెలబోయాయి. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గడంతో స్థానికులు, మండల గ్రామాలు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, ఒడిశా కూలీలు ముమ్మరంగా తరలి వచ్చి తమకు కావాల్సినవి కొనుగోలు చేశారు. దీంతో సంత కళకళలాడింది. కూరగాయల ధరలు స్వల్పంగా పెరిగాయి.

కిలో టమాటా రూ.15 నుంచి రూ.20కు, బంగాళాదుంప రూ.20 నుంచి రూ.30కు పెరిగింది. ఉల్లిపాయ రూ.20, బెండకాయ రూ.40, దొండకాయ, బీరకాయ, క్యారెట్, బీట్రూట్ రూ.60, క్యాప్సికం రూ.80కు విక్రయాలు సాగాయి.



భానుడి ప్రతాపంతో కశింకోటలో వెలవెలబోతున్న వారపు సంత

ఎండ వేడిమి తాళలేక..

మండలంలో సూర్యుడి తాపం గురువారం కూడా తగ్గలేదు. మరింత ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎండ వేడిమి తాళలేక ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయట తిరగలేదు. దీంతో కశింకోటలోని ప్రధాన రహదారులు బోసిపోయాయి. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గడంతో ఎవరి పనులు వారు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు.

పందులను అరికట్టాలని వినతి

అనకాపల్లి రూరల్: మండలంలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో పందుల స్వైర విహారం ఎక్కువగా వుందని, అదే విధంగా కుక్కల బెడద కూడా మరింత ప్రమాదకరంగా వుందని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో కార్యాలయం అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. కొత్తూరు, సత్యనారాయణపురం పంచాయతీల పరిధిలో అనేక కాలనీలు, రహదారులు, జనావాసాల మధ్య విచ్చలవిడిగా పందులు సంచరిస్తున్నాయని చెప్పారు. కుక్కలు కూడా భయాందోళనకు గురి చేస్తున్నాయని బీఎస్పీ నేత వనమాల నాగభూషణం, కొల్లి సత్యారావు, చిన్నారావు, అప్పారావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మాణిక్యాలరావు

అర్బన్ హెల్త్ సెంటర్ రాకతో సాకారమైన కల



వైద్యుడు శ్రీరామ్‌గౌతమ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లిటౌన్: అర్బన్ హెల్త్ సెంటర్ రాకతో ఎంతో కాలంగా వేచి చూసిన శుభదినం సాకారమైందని 84వ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ అన్నారు. అంతకు ముందు సెంటర్‌కు నియమితులైన వైద్యుడు శ్రీరామ్‌గౌతమ్, సిబ్బందిని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వార్డు ప్రజలు, పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నేతలు అప్పికొండ రవిశంకర్, మొగలపల్లి రవితేజ, సేనాపతి సాయి, కారుకుండి కన్నబాబు, పిండింటి కృష్ణ, కశిరెడ్డి నగేష్, పలకా నాయుడు, వాసు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి చర్యలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో దీర్ఘకాలంగా అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని గురువారం అరబిందో పరిశ్రమ నిర్వాహకులు పరిశీలించారు. 2004లో ప్రారంభించిన కల్యాణ మండప నిర్మాణం నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. నాటి నుంచి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సిఫార్సుతో అరబిందో పరిశ్రమ కల్యాణ మండపాన్ని పూర్తి చేసే సంకల్పంతో ముందుకొచ్చింది. దీనిలో భాగంగా ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజులతో కలిసి కల్యాణ మండప అసంపూర్తి భవనాన్ని గురువారం పరిశీలించారు. భవనంలో అవసరమైన సదుపాయాలు కల్పించి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని పరిశ్రమ ప్రతినిధులు హామీ ఇచ్చారని సచివాలయ కన్వీనర్ లగిశెట్టి గణేష్ తెలిపారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు గుమ్మడి నారాయణరావు, చిన్ని జనార్దన్, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న అరబిందో పరిశ్రమ ప్రతినిధులు, ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు

రూ.కోటితో రెండు కల్యాణ మండపాల నిర్మాణం

- బవులవాడ, వెంకుపాలెం గ్రామాల్లో ఎంపీపీ స్థలాల పరిశీలన

అనకాపల్లి రూరల్: మండలంలోని బవులవాడ, వెంకుపాలెం గ్రామాల్లో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న రెండు కల్యాణ మండపాలకు సంబంధించి పనులపై గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు అక్కడ పర్యటించారు. ఈ గ్రామాల్లో స్థలాలను ఆయన పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కృషితో అరబిందో కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.కోటితో రెండు కల్యాణ మండపాలను నిర్మిస్తోందని చెప్పారు. రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఎంపీడీవో కె.ధర్మారావు, పంచాయతీరాజ్ డీఈఈ వేణుగోపాల్ సర్పంచ్‌లు రాపేటి నాగేశ్వరరావు, మజ్జి వెంకటప్పారావు, ఎంపీటీసీలు రాపేటి వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాడి కుమార్, బొద్దపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మండపాల నిర్మాణంపై చర్చిస్తున్న ఎంపీపీ సూరిబాబు

ఇంటింటా సర్వే



తాళ్లపాలెంలో కరపత్రం అందిస్తున్న నాయకులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో గురువారం రాత్రి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. స్టిక్కర్లు అంటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా తీరుపై సర్వే చేశారు. సచివాలయ కన్వీనర్లు లగిశెట్టి గణేష్, గుమ్మడి నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం శ్రీను, కిల్లాడ రమణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా చెరువులు

నక్కపల్లి: మండలంలో ప్రతి సచివాలయ పరిధిలో ఒక చెరువును ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పార్క్ మాదిరిగా తయారు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. కాగితలో ఎంపిక చేసిన చెరువును గురువారం ఆయన పరిశీలించారు. పాండ్స్ బ్యూటిఫికేషన్ పేరుతో ప్రతిగ్రామంనుంచి ఒక చెరువును ఎంపిక చేసి గట్లు పటిష్టం చేయడం, పిచ్చిమొక్కలు తొలగించడం, కొత్తగా మొక్కలు నాటడం,వాకింగ్ ట్రాక్ నిర్మించడం, సాయంత్రం సమయంలో కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపడతామన్నారు. సాయంత్రం సమయంలో ఇక్కడ ప్రజలు సందర్శించేందుకు వీలుగా సదుపాయాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పిచ్చిమొక్కల తొలగింపు, గట్టు పటిష్టం వంటి పనులు, మిగిలిన సదుపాయాలు పంచాయతీ సహకారంతో చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలోఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, సర్పంచ్ పోతంశెట్టి రాజేష్ ,ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం నక్కపల్లిలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్నిఎంపీడీవో సందర్శించారు.



కాగితలో చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

హుషారుగా 'మా నమ్మకం నువ్వే జగన్'



బారువారి వీధిలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మందపాటి సునీత



లబ్ధిదారులతో కలిసి జగనన్న స్టిక్కర్‌ను ప్రదర్శిస్తున్న కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: పట్టణంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని అంటూ ఆ పార్టీ నేతలు గురువారం నిర్వహించారు. 82వ వార్డు బారువారి వీధిలో వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పాలనపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాసుకున్నారు. అంతకు ముందు కాలనీ ప్రజలకు జగనన్న స్టిక్కర్లు, సంక్షేమ పథకాల పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడిమిశెట్టి సతీష్, పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, సచివాలయ కన్వీనర్ తాటికొండ జీవన్, గృహసారథులు మొల్లేటి మూర్తి, పెనుమండ సీతారామరాజు, జి.లక్ష్మి, ఎం.హైమావతి పాల్గొన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులో మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ మహిళలకు జగనన్న స్టిక్కర్లు అందించారు. 83వ వార్డు పరిధిలో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

గవరపాలెం దాసరిగెడ్డ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేఎం నాయుడు ప్రజలకు జగనన్న పుస్తకాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నూకాంబికకు సారె సమర్పణ



తలపై సారె మోసుకుంటూ వెళ్తున్న మహిళలు

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయం తరఫున గవరపాలెం నూకాంబిక అమ్మవారికి గురువారం మహిళలు సారె సమర్పించారు. బూరెలు, అరిసెలు, జంతికలు, మినపసున్నుండలు, లడ్డూ, కాజా, పసుపు, కుంకుమ, అరటి పండ్లు తలపై మోసుకుంటూ కాలినడకన నూకాంబిక ఆలయానికి చేరుకొని అమ్మవారికి నివేదించారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత

మునగపాక: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని గైనకాలజిస్టు తిరుమల జ్యోతి అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో చంద్రశేఖర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురువారం మధ్యాహ్నం మహిళల్లో ఆరోగ్య మార్పులకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మానసిక సంకల్పంతో మహిళలు వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు. ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ఉండాలని, వ్యాయామం అలవరచుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ జ్యోతిని ఘనంగా సత్కరించారు. ధ్యాన గురువు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దంత వైద్యులు భావన,మౌళి,శ్రీదేవి,గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

17న పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళన

అనకాపల్లి రూరల్: తుమ్మపాల పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ సొసైటీల(సీఐటీయూ) యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. జిల్లా పీఏసీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పి.నాగభూషణం మాట్లాడుతూ పీఏసీఎస్‌ల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 17న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి పే రివిజన్ చేయాలని, ఇప్పటి వరకూ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ జనరల్ సెక్రటరీ ఆర్.శివరామకృష్ణ, అసోసియేషన్ ప్రెసిడెంట్ మళ్ల స్వామి చంద్రనాయుడు, ట్రెజరర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు

కశింకోట: మండలంలోని బుచ్చియ్యపేట గ్రామంలో తల్లీకుమార్తె అదృశ్యంపై కేసు నమోదు చేశామని గురువారం రాత్రి ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి విలేకరులకు తెలిపారు. బుచ్చియ్యపేటకు చెందిన చంపకాయల గజ్జాలుకు ఇదే మండలం నూతలగుంటపాలెం గ్రామానికి చెందిన యువతితో 2016లో వివాహం జరిగిందని, వారికి ఆరేళ్ల బాలిక ఉందన్నారు. అయితే పెళ్లయిన తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చినప్పుడు అమ్మాయితో పాటు భార్య తన పుట్టింటికి వెళ్లిపోయి పెద్దల సమక్షంలో మాట్లాడుకుని మళ్లీ భర్త వద్దకు కాపురానికి వస్తూ ఉండేదని.. ఇదే క్రమంలో ఈ నెల 11న తన ఇంటి నుంచి కుమార్తెతో పాటు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన భార్య తిరిగి రాలేదన్నారు. దీంతో వారి కోసం ఎక్కడ వెదికినా ఆచూకీ లేకపోవడంతో భర్త గజ్జాలు తమకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దే వైద్య సేవలు

ఎస్.రాయవరం: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ఇంటివద్దే వైద్య సేవలు పొందవచ్చని 104 వైద్యులు శ్రావ్య అన్నారు. గుడివాడ గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించారు. సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించి 80 మందికి వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. కొత్తపోలవరం వెళ్లి ఇంటివద్ద ఉన్న రోగిని పరీక్షించి మందులు ఇచ్చారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావ్య

భోజనం బాగోక పస్తులు

ఎస్.రాయవరం: స్కూల్‌లో పెడుతున్న ఉడికీఉడకని అన్నం తినలేకపోవతున్నామని నారాయణపట్నం ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలిపారు. భోజన నిర్వాహకులు సరిగా ఆహారపదార్థాలను తయారు చేయడంలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం పాఠశాలకు వచ్చి భోజన నిర్వాహకులను నిలదీశారు. భోజనం బాగోలేకపోవడంతో పిల్లలు పస్తులు ఉండవలసి వస్తోందని వారు తెలిపారు. ఇదే విషయాన్ని చాలా సార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని వారు చెప్పారు. కూరలు కూడా రుచిగా ఉండటంలేదని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో మరోమారు పాఠశాలకు వస్తామని వారు వెళ్లిపోయారు.

వరి పైరు పరిశీలన

మునగపాక: మండలంలోని గొల్లలపాలెం, వాడ్రాపల్లి గ్రామాల్లో వరిపైరును గురువారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని, పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఏఈవో లక్ష్మి,నాగవరం వీఏఏ మౌల్య తదితరులు పాల్గొన్నారు.